'మన గుండె- మన బాధ్యత'

సీపీఆర్ చేసి చూపిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 : ఉరుకుల, పరుగుల జీవనశైలితో ఎక్కువగా 30 ఏండ్ల వయస్సు వారే గుండెనొప్పి వచ్చి మృతి చెందుతున్నారని 'మన గుండె-మన బాధ్యత' మనపైన ఉందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. అదివారం హోప్ న్యురో యాజమాన్యం ఆధ్వ ర్యంలో గుండెనొప్పిపై నిర్వహించిన అవగాహన సదస్సులో అయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా మట్లాడారు. ప్రతి ఒక్కరూ వారి జీవనశైలి విధానం మార్పు చేసుకోవాలని క్రమం తప్పకుండా వాకింగ్ వ్యాయామం, ఆహారం మితంగా తీసుకోవడం వల్ల గుండెనొప్పిని నివరించవచ్చన్నారు. కార్యక్రమంలో హోప్ న్యురో యాజ్యమా న్యం డైరెక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు

అందోల్, ఫిబ్రవరి 4: నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించినట్లు ఓపెన్ డిగ్రీ కో-ఆర్డినేటర్ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మధ్యలోనే ఆపేసిన ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యను అందించాలనేది యూనివర్సిటీ లక్ష్యమన్నారు. జోగిపేట ఓపెన్ డిగ్రీ సెంటర్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీసెంటర్ సిబ్బంది శ్రీనివాస్, మల్లేశం, సురేశ్, ప్రభాకర్, మల్లికార్జున్‌రెడ్డి, విద్యాసాగర్, ప్రపుల్లకుమార్ పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్య పరీక్షలు సక్సెస్

జహీరాబాద్, ఫిబ్రవరి 4 : పేదలకు కార్పొరేట్ వైద్య చికిత్సలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి కిమ్స్, గ్లోబల్ ఐ దవాఖానకు చెందిన వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. వైద్యశిబిరంలో 1150 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, శిబిరంలో పాల్గొన్న డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి

సర్పంచ్ సేవలు భేష్

రాయికోడ్, ఫిబ్రవరి 4: ఐదేండ్లుగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ సంపూర్ణబాయి, ఉపసర్పంచ్ నాగేశ్, పాలక వర్గం సభ్యులను సన్మానించారు. ఆదివారం మండల పరిధిలోని షాపూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ సంపూర్ణబాయి, ఉపసర్పంచ్ నాగేశ్, పాలకవర్గం సభ్యులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పదవీకాలం పూర్తయిన సర్పంచ్, పాలకవర్గం సభ్యులు ఎంతో అదృష్టవంతులని, వారి హయాంలోనే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని, రైతు వేదిక నిర్మాణం, ప్రకృతి వనాలు, శ్మశానవాటికాలు, హరితహారం, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు వంటి అనేక పనులను చేపట్టారని గుర్తు చేశారు. సమావేశానికి ముందు ఎంపీపీ వెంకట్‌రావుపాటిల్ మృతికి సంతాపం తెలిపారు.



షాపూర్‌లో మాజీ సర్పంచ్ సంపూర్ణ బాయి, ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న గ్రామస్తులు

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాయికోడ్, ఫిబ్రవరి 4 : గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని జహీరాబాద్ డీఎస్పీ రాఘు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సీరూర్ గ్రామ శివారులో ఉన్న మంజీరానదిలో ఉదయం మత్స్యకారులు చేపలవేటకు వెళ్లిపోవడంతో నదిలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ రాఘు, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం పరిశీలించగా, మృతురాలు సుమారు 25-30 ఏండ్లు ఉన్నట్లు గుర్తించారు. మృతురాలిని కాళ్లు, చేతులు కట్టేసి, దారుణంగా హత్య చేసి పెద్ద బండరాయితో కట్టి వేసినట్లు ఉన్నది. స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సీఐ వెంకటేశం, ఎస్సై వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రఘు

ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4: పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఎండు గంజాయిని కారులో రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, నల్లగొండ జిల్లా బొల్లారం పట్టి గ్రామానికి చెందిన రమావత్ రమేశ్‌చంద్రగా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి రూ.12 లక్షల విలువైన 84 కిలోల ఎండు గంజాయిని, బొలేరో కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పాలకమండలి లేక భక్తులకు ఇక్కట్లు

- 40 రోజులల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- రెగ్యులర్ కార్యనిర్వాహణ అధికారిని నియమించాలి
- సమస్యల వలయంలో కేతకీ ఆలయం

కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం

ఝరాసంగం, ఫిబ్రవరి 4 : తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఝరాసంగం మండల కేంద్రంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి పాలక మండలి లేక భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మూడుసార్లు మూడేండ్ల పాటు పాలక మండలి సభ్యులను నియమించింది. తెలంగాణ ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అనేక దేవాలయాలు అభివృద్ధి చెందాయి, నారాయణఖేడ్ సభలో నాటి సీఎం కేసీఆర్ కేతకీ ఆలయానికి వచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు, దీం తో ఆలయ రూపురేఖలు మారుతాయని స్థానికులు, భక్తులు ఆశించారు. కానీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. నాలుగు నెలలుగా పాలక మండలి లేక భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు విచ్చేస్తుంటారు. ఏటా రెండు కోట్లకు పైగా ఆదాయం వచ్చే ఈ ఆలయానికి నూతన పాలకమండలిని వచ్చే శివరాత్రి బ్రహ్మోత్సవాల నాటికి నియమించాలని భక్తులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు చైర్మన్లుగా..

ఏడు పర్యాయాలు ఎంపీగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఏం. బాగారెడ్డి 1969-71 వరకు మొట్టమొదటి సారిగా కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత మాజీ జడ్పీచైర్‌పర్సన్ సునీతాపాటిల్ మామ సంగప్పపాటిల్ 1971-85 వరకు నాలుగు పర్యాయాలు ఆలయ చైర్మన్‌గా పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. మల్లికార్జున్ 1986 వరకు రెండు పర్యాయాలు, బోరెగావ్ గ్రామానికి చెందిన హన్మన్న పాటిల్ 1996-99 వరకు రెండు పర్యాయాలు, ఝరాసంగానికి చెందిన బస్వరాజ్ పాటిల్, ఎల్గోయి గ్రామానికి చెందిన ఉమాకాంత్ పాటిల్, కుప్పనగర్‌కు చెందిన మాణయ్య షెట్కార్ ఒక్కో పర్యాయం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2007-12 వరకు ఐదేండ్ల పాటు పాలక మండల చైర్మన్‌ను నియమించలేదు. 2013-19 వరకు గుంతమర్పల్లి నర్సింహాగౌడ్, నీల వెంకటేశం గుప్తా రెండు పర్యాయాలుగా పనిచేశారు. అక్టోబర్ నుంచి ఆలయ అధ్యక్ష పదవి ఖాళీగానే ఉన్నది.

కేతకీ ఆదాయం

కేతకీ దర్శనానికి వచ్చే భక్తులు హుండీలో వేసే నగదు కానుకలు, అభిషేకాలు, దర్శనం టికెట్లు, లడ్డూ, పులిహోర, కేశఖండన, పెండ్లిళ్లు, వాహనాల పూజ, సత్రాల కిరాయిలు కలుపుకొని ఏడాదికి దాదాపు రెండు కోట్లకుపైగా ఆదాయం వస్తున్నది. ఆలయానికి ప్రతి ఆదివా రం, సోమవారాలతో పాటు అమావాస్య, శ్రా వాణ మాసం, దసరాఉత్సవాలు, శివరాత్రి, వేసవి సెలవులు, వివాహ శుభకార్యాలయాలకు భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు.

ఆలయానికి ప్రధాన సమస్యలు

ఆలయానికి వచ్చే భక్తులకు ప్రధానంగా ఆలయం ముందు నుంచి ప్రవహిస్తున్న వాలద్రివాగు, ఆన్‌లైన్ వ్యవస్థ, వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, భక్తులు ఉండేందుకు సత్రాలు, తాగునీటి సౌకర్యం తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకొని కేతకీ ఆలయాన్ని మరో యాదాద్రి పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేపట్టాలని స్థానికులు, భక్తు లు మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలి

జిన్నారం, ఫిబ్రవరి 4 : రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ఆల్‌ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన జిన్నారంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీనవర్గాలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పట్టాలు ఇచ్చి పేదల జీవన స్థితిగతులను మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి, జీవిత చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జిన్నారం, ఫిబ్రవరి 4 : గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం నాల్గోవార్షికోత్సవ పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబాను దర్శించుకునేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు.

సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

బొల్లారం, ఫిబ్రవరి 4 : మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి బొల్లారం మున్సిపల్ బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు భారీగా తరలివెళ్లారు. పార్టీ మున్సిపల్‌శాఖ అధ్యక్షుడు హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజారాణి, బీఆర్ఎస్ నాయకులు చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి సమావేశానికి బయలుదేరి వెళ్లారు.

సమ్మెపోస్టర్ ఆవిష్కరణ

గుమ్మడిదల, ఫిబ్రవరి 4 : ప్రధాని నరేంద్రమోదీ సర్కారు కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు కే. రాజయ్య విమర్శించారు. దేశసంపదను కార్పొరేట్లకు అమ్ముతూ ఒక్కరిద్దరిని కోటీశ్వర్లుగా చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెవాల్ పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మోదీ విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో సంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని గుర్తుచేశారు. సీఐటీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్ గౌడ్, యూసుఫ్, గట్టయ్య, సురేందర్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4 : రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరంగూడ కమాన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని భవానీ పురానికి చెందిన మహ్మద్ అమీర్ (27) రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం డ్యూటీకి తన బైక్‌పై వెళ్తున్న క్రమంలో బీరంగూడ కమాన్ వద్ద యూటర్న్ చేస్తున్న సమయంలో పటాన్‌చెరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మహ్మద్ అమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే దవాఖానకు తరలించగా, మెరుగైన చికిత్స కోసం కిమ్స్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు మహ్మద్ అర్మాన్ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన మహ్మద్ అమీర్

మట్టి అక్రమ రవాణాకు చెక్‌పెడతాం

తహసీల్దార్ గంగాభవానీ

గుమ్మడిదల, ఫిబ్రవరి 4: ఇష్టారాజ్యంగా నల్లమట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. శనివారం రాత్రి నర్సాపూర్ పట్టణంలోని చెరువుల నుంచి నల్లమట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న 8 టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. తహసీల్దార్ గంగాభవానీ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ పట్టణంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువుల నుంచి నల్లమట్టిని నిత్యం నిరంతరం నడుస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా మట్టిరవాణా మాఫియా సారవంతమైన నల్లమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం యథేచ్ఛగా నడుస్తుండడంతో పాటు మైనింగ్ శాఖ, రెవెన్యూశాఖ అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో ఆదివారం రాత్రి రోజుమాదిరిగానే మట్టిని తరలిస్తుండడంతో తహసీల్దార్ గంగాభవానీ, గిర్దావర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో కలిసి మట్టిని తరలిస్తున్న 8 టిప్పర్ లారీలను పట్టుకున్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మట్టి వ్యా పారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాలను పట్టుకుని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

దత్తాత్రేయస్వామి భక్తులకు ఘన స్వాగతం

జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద భక్తులకు స్వాగతం పలుకుతున్న ఢిల్లీ వసంత్ బృందం సభ్యులు

జహీరాబాద్, ఫిబ్రవరి 4 : మహారాష్ట్రకు వెళ్తున్న దత్తాత్రేయ స్వామి భక్తులకు జహీరాబాద్‌లో జాతీయ రైతు నేత, సామాజిక ఉద్యమకారులు ఢిల్లీ వసంత్ కుమార్ బృందం ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న దత్తాత్రేయ స్వామి భక్తులకు పస్తాపూర్ శివారులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్వాగతం పలికారు. త్రిమూర్తి స్వరూపుడు దత్తాత్రేయ స్వామి మహాత్మ్యం తెలియజేసిన గురుచరిత్ర గ్రంథాన్ని ప్రామాణికమైందని వివరించారు.

సామాజిక విలువలను పటిష్టం చేసి భక్తి ఉద్యమాలు దేశానికి ఎంతైనా అవసరమన్నారు. బృందం సభ్యులు పాదపూజ చేసి మంగళహారతితో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ధర్మకర్త వేణుగోపాల్, పండిత్ బద్రినారాయణ పంతులు, మాతా కుసుమ దేవి, అశోక్‌పాటిల్, మాధవరెడ్డి, విశ్వనాథ్ యాదవ్, జ్యోతి పండాల్, సుధీర్ బండారి, శివ భక్తులు, శేఖర్, ప్రవీణ్, మహేశ్, రాజు, సురేశ్, భూమన్ స్టీవీన్సన్, విష్ణువర్ధన్, అంజి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్

ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన కరెంట్ మీటరు

పొలం నీళ్లు ఫ్యాక్టరీకి వాడకం

- నిత్యం వందలాది ట్యాంకర్ల తరలింపు
- వ్యవసాయ క్షేత్రానికి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని అధికారులు

చెరాగ్‌పల్లి- సత్వార్ శివారులో వ్యవసాయ బోరు నుంచి ట్యాంకరులో నింపుతున్న నీరు

జహీరాబాద్, ఫిబ్రవరి 4 : పంటలు సాగు చేసేందుకు పొలంలో వేసిన బోరుబావుల నుంచి ఫ్యాక్టరీలకు నీటిని తరలిస్తూ కొందరు సొమ్ముచేసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా 65వ జాతీయ రహదారిపై చిరాగ్‌పల్లి -సత్వార్ శివారు మధ్యలో వ్యవసాయ క్షేత్రం నుంచి ఓ పరిశ్రమకు నిత్యం నీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నారు. నీటి వ్యాపారం చేయాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, చిరాగ్‌పలి-సత్వార్ శివారు మధ్యలోని ఓ పొలం నుంచి ప్రతి రోజూ ట్యాంకర్ ద్వారా నీటిని ఫ్యాకరీకి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులను మచ్చిక చేసుకొని అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పంటలు సాగు చేసేందుకు బోరు వేసి, విద్యుత్ కనెక్షన్ తీసుకొని మామిడి చెట్లు పెంపకం చేస్తున్నారు. మామిడి చెట్లు పెంపకంతో పాటు బోరు నీటితో వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రతి రోజు వందల ట్యాంకర్ల నీటిని పరిశ్రమకు తరలిస్తున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.

వ్యవసాయ బోరు మోటర్‌తో..

ఈ వ్యవసాయక్షేత్రంలోని బోరుకు విద్యుత్ అధికారులు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, మోటర్ బిగించారు. అధికారులు వ్యవసాయ బోరుకు పెట్టిన మో టర్ పని చేస్తుందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ నీటి వ్యాపారానికి ప్రభుత్వ అనుమతి ఉందా, ఒకవేళ లేకపోతే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవు తున్నాయి. సంబంధిత అధి కారులు విచారణ చేపట్టి చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. దీనికి కేవలం పంటల సాగుకు మాత్రమే వినియోగించుకోవాలి. అలా కాదని వ్యవసాయ బోరు బావుల నుంచి ఉచిత విద్యుత్ ఆధారంగా ట్యాంకర్ల ద్వారా ఫ్యాక్టరీలకు నీటిని సరఫరా చేయడం చట్టరీత్యా నేరం.

రాములోరి ప్రసాదం పంపిణీ

న్యాల్‌కల్, ఫిబ్రవరి 4 : మండలంలోని హద్నూర్‌లో అయోధ్య బాలరాముడి ప్రసాదం రామభక్తులకు పంపిణీ చేశారు. జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈరన్న అయోధ్య నుంచి వచ్చిన బాలరాముడి ప్రసాదాన్ని గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 4: బుచినెల్లి గ్రామంలోని ఒకటో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వార్డు నంబర్ ఒకటిలో వారం రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. బోరు మోటర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. జిల్లా అధికారులు పట్టించుకోని తాగునీటి సరఫరా చేయాలని కోరారు.

ఆలయంలో హోమం

మనూరు, ఫిబ్రవరి 4 : హనుమాన్ ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించారు. మండలంలోని మాయికోడ్‌లో వివేకానంద సేవా సవాసమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి ఆదివారం హనుమాన్ ఆలయంలో హోమం నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన హోమంలో గ్రామానికి చెందిన అర్జున్ రావు, శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులు పాల్గొని హోమం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి సభ్యులు భీమన్న, శివారాజ్, అఖిల్, బీరప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

యువతి మృతి

అందోల్, ఫిబ్రవరి 4: విద్యుదాఘాతంతో ఓ యువతి మృతిచెందిన ఘటన మండలంలోని మాసాన్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకున్నది. ఘటనకు సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పవిత్ర (21)ఆదివారం ఉదయం వేడి నీళ్ల కోసం వాటర్ హీటర్ పెట్టి దానిని తీస్తున్న సమయంలో కరెంట్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు యువతిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అవార్డు రావడంపై హర్షం

రాయికోడ్, ఫిబ్రవరి 4 : మన ఊరి అమ్మాయికి దక్షిణ భారతదేశంలోనే అవార్డు రావడం చాలా సంతోషకరమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివా రం మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన మొగులయ్య, స్వరూపల కూతురు నందిని మండల కేంద్రమైన రాయికోడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నది. ఇటీవల విజయవాడలో దక్షిణభారత దేశానికి సంబంధించిన సైన్స్‌ఫెయిర్‌లో రోడ్డుకు సంబంధించి అంశంపై ఈ అమ్మాయి తయారు చేసిన నమూనాకు ఐదోస్థానం రావడంతో మాజీ సర్పంచ్ సంపూర్ణబాయి, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్, గ్రామస్తులు సన్మానం చేశారు.

మహిళ ఆత్మహత్య

అందోల్, ఫిబ్రవరి 4 : ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు జోగిపేట ఎస్సై-2 మొగులయ్య తెలిపారు. మండలంలోని కొడెకల్ గ్రామానికి చెందిన శ్రీలత (26) భర్త, తల్లితండ్రులతో కలిసి గ్రామంలో ఉంటుంది. కుటుంబ పోషణ, ఇతరత్రా అవసరాలకు అప్పులు కావడంతో కొన్ని రోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసిక వేదనకు గురై ఆదివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రిపై దాడి

గుమ్మడిదల, ఫిబ్రవరి 4 : నిత్యం మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడే తండ్రిపై విసుగు చెందిన కుమారుడు కర్రతో దాడి చేయగా, ఈ ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో రాంరెడ్డి బావి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డిబావి గ్రామానికి చెందిన కొంచం కృష్ణారెడ్డి (50) ప్రతి రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి మద్యం తాగివచ్చి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. కుమారుడు రఘుపతిరెడ్డి విసుగు చెంది కోపంతో కర్రతో తండ్రి తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది సుడేబాల్ రెడ్డి ఆదివారం ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.